కార్మికుడు నారాయణ కుటుంబాన్ని ఆదుకుంటాం



బండి రమేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన మృతుడు నారాయణ కుటుంబ సభ్యులు

కూకట్‌పల్లి: మూసాపేటకు చెందిన సెంట్రింగ్ కార్మికుడు నారాయణ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గత నెల మృతి చెందాడు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను కలవగా బిల్డర్‌తో మాట్లాడి రూ.15లక్షలను నారాయణ కుటుంబానికి ఇప్పించారు. ఈ మేరకు కార్మికుడు నారాయణ కుటుంబ సభ్యులు సోమవారం బండి రమేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శేరి సతీష్‌రెడ్డి, దినేష్‌కుమార్, సయ్యద్ బాబు, సంతోష్ కుమార్, విఠల్‌రెడ్డి, రేష్మ, నాగమల్లి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిల సబ్‌స్టేషన్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



సోమశిల సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: వేసవికాలం యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కూకట్‌పల్లిలోని సోమశిల సబ్‌స్టేషన్‌లో పాత ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. సోమవారం ఈ ట్రాన్స్‌ఫార్మర్లను సీజీఎం ఇంజినీర్ సాయిబాబా, ఎస్ఈ డీఎస్ మోహన్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండాకాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగిందని అందుకే 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆపరేషన్ కూకట్‌పల్లి చక్రవర్తి, ఏఈఈ, కూకట్‌పల్లి ప్రసాద్, భక్తవత్సల్‌రెడ్డి, అశోక్, ఏఈ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం

కూకట్‌పల్లి బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బీజేపీ సీనియర్ నాయకులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రముఖులను కలుస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం కూకట్‌పల్లికి చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్, నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఈటల రాజేందర్‌ను ప్రకటించటం చాలా సంతోషకరమని అన్నారు. అందరం సమష్టిగా పనిచేసి ఈటలను భారీ మెజారీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తామన్నారు. మూడోసారి కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేని పద్మారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, డివిజన్ అధ్యక్షులు అనంత నాగరాజు, డివిజన్ నాయకులు దిలీప్, వెంకటేష్, ఉదయ్, రాఘవేందర్, బాలరాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.





కూకట్‌పల్లి బీజేపీ నాయకులను కలిసిన మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలను సంరక్షించాలి



సమావేశంలో పాల్గొన్న లయన్ అన్నెం కోటిరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని లయన్స్ క్లబ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ 320డీ కార్యదర్శి లయన్ అన్నెం కోటిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జరిగిన సమావేశంలో పర్యావరణ పరిరక్షణ కోసం–2023 సంవత్సరంలో చేసిన సేవలకు గాను అవార్డును పొందానని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి బస్తీ, కాలనీలో మొక్కలు నాటి వాటిని సంరక్షించే విధంగా చర్యలు చేపడతానని తెలిపారు. అదే విధంగా ఇంటి నిర్మాణం చేపట్టినప్పుడు ఇంకుడు గుంతతో పాటు, మొక్కల కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీ రమణారెడ్డి, వేమూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో నాలాల సమస్యలను పరిష్కరించండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో ఎమ్మెల్యే, కార్పొరేటర్ల సమావేశం



జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు సమస్యలు వినిపిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గ కార్పొరేటర్లు సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌తో సమావేశమయ్యారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని నాలాల సమస్యలపై చర్చించారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా నాలాలు అస్తవ్యస్తంగా ఉంటే ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. అన్ని డివిజన్లలో నాలాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న శ్మశానవాటికలు, పార్కు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జెడ్‌సీ అభిలాష్ అభినవ్, కార్పొరేటర్లు ముద్దం నరసింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, సబిహా బేగం, పగుడాల శిరీష బాబూరావు, మహేశ్వరి శ్రీహరి తదితరలు పాల్గొన్నారు.

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పెండింగ్ పనులను పూర్తిచేయాలి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో నెలకొన్న సమస్యలతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులకు సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కోరారు. హస్మత్‌పేట్ దుబాయిగేట్ నుంచి ప్రియదర్శిని హోటల్ వరకు రోడ్డును 60ఫీట్ల వరకు విస్తరించాలన్నారు. రామరాజునగర్, విఠల్ ఎన్‌క్లేవ్, మల్లికార్జుననగర్ రోడ్డు 3, మానసా సరోవర్ హైట్స్, సాయి సాగర్ ఎన్‌క్లేవ్ లలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. బోయిన్ చెరువు సుందరీకరణలో భాగంగా పెండింగ్‌లో పనులను పూర్తి చేయాలని నిధులు కేటాయించాలని తెలిపారు. అదే విధంగా లక్ష్మీనర్సమ్మ కాలనీ, గౌరినగర్‌లలో రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు.



కార్పొరేటర్లతో కలిసి కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఫుడ్ ఫెస్టివల్



కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్ వద్ద అధ్యాపకులు

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డిపార్టుమెంట్ ఆఫ్ లాంగ్వేజెస్ ఆధ్వర్యంలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. బి.భవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వంటకాలను అధ్యాపకులు రుచి చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డా.రమేష్ బాబు, జీవశాస్త్రాల విభాగాధిపతి డా. పి.సురేష్‌బాబు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థిని పవిత్రాచారికి రెండు కాంస్య పతకాలు

బాలానగర్: ఖమ్మం జిల్లాకు చెందిన పవిత్రాచారి జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో పొడగంటి పవిత్రాచారి మొదటి సంవత్సరం చదువుతోంది. జమ్మూ యూనివర్సిటీలో ఫిబ్రవరి 13 నుంచి 18 వరకు జరిగిన చైనీస్ మార్షల్ ఆర్ట్స్ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఆమె కాంస్య పతకం సాధించారు. అదే విధంగా జార్ఖండ్‌లో ఫిబ్రవరి 21 నుంచి 27 వరకు జరిగిన ఫెడరేషన్ కప్పు పోటీల్లో కాంస్య పతకం సాధించి మంచి ప్రతిభ కనబరిచారు. సోమవారం జేఎన్‌టీయూ వీసీ డా. కట్టా నరసింహారెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా పవిత్రాచారిని వీసీ, ప్రొఫెసర్లు సత్కరించి అభినందించారు. పవిత్రాచారిని యూనివర్సిటీకి చెందిన కళాశాలల విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని జేఎన్‌టీయూకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పవిత్రకు శిక్షణ ఇచ్చిన డా. దిలీప్‌ను, డా.అశోక్‌ను అభినందించారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్



సిద్ధిఖీనగర్‌లో జగదీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న కార్యకర్తలు

గచ్చిబౌలి: పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ కార్యకర్తలు, నాయకులకు సూచించారు.కొండాపూర్ డివిజన్‌లోని సిద్ధిఖ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో పార్టీ పరిస్థితిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనకు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని కాలనీ, బస్తీలలో పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై కార్యకర్తలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పనులను ప్రజలకు వివరించాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నందు, గోపాల్‌గౌడ్, ఫాజిల్, గణేష్, రవియాదవ్, వినయ్‌రెడ్డి, గాల్‌రెడ్డి, వెంకటస్వామి, అప్పల్‌కుమార్ యాదవ్, యోగిరెడ్డి, యాదయ్యగౌడ్, రవికుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా చేనేత ఉత్పత్తులు

సందడి చేసిన నటీనటులు



సాక్షి,సిటీబ్యూరో: కూకట్‌పల్లిలోని ఐశ్వర్య సిల్క్స్ 3వ వార్షికోత్సవంలో ప్రముఖ నటుడు, 'ఆట'ఫేమ్ సందీప్ ఆయన సతీమణి జ్యోతిరాజ్, యార్ జాను తదితరులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఐశ్వర్య సిల్క్స్ ఎండీ లక్ష్మి మాట్లాడుతూ.. తాను వీవర్స్ సామాజిక వర్గం నుంచి వచ్చిన మహిళనని అన్నారు. తన తొలి ప్రాధాన్యం చేనేత ఉత్పత్తులపైనే ఉంటుందన్నారు. నేతన్నలను ప్రోత్సహించేలా దేశవ్యాప్తంగా చేనేత ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు. నేటి యువతకు తగిన డిజైన్‌లలో తమ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నగరంలో మరిన్ని బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా నటీ, నటులు డిజైనరీ చేనేత వస్త్రాలను ధరించి ఆకట్టుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన శ్రీనివాస్‌రెడ్డి

కూకట్‌పల్లి: బేగంపేట్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం తన నివాసంలో ఆయన నివాసంలో సోమవారం శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.



ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బీజేవైఎం నాయకుడు కన్నె ప్రకాశ్



అంజయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని అనారోగ్యం బారిన పడకుండా ఉండాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నె ప్రకాశ్ అన్నారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్‌లోని బీజేవైఎం కార్యాలయం వద్ద సోమవారం నోవాకేర్ ఆస్పత్రి నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులకు బీపీ, షుగర్, థైరాయిడ్‌తో పాటు జనరల్ టెస్ట్‌లను నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు చింటువర్మ, యోగి, అమర్, సాయి, కార్తీక్, సునీల్ వర్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా యువత తయారవ్వాలి

సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్



మాట్లాడుతున్న రత్నాకర్

గచ్చిబౌలి: దేశం గర్వించేలా యువత తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని సత్యసాయిసెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో సత్యసాయి సేవా సంస్థ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న ప్రేమ, దయ గుణాలు ప్రపంచంలో ఎక్కడా కనిపించవన్నారు. సత్యసాయి బాబా బోధించిన విధంగా మన జీవితాలకు మనమే బాధ్యులమని గ్రహించి ముందుకు సాగాలన్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్నా దేశంలో వృద్ధాశ్రమాలు పెరిగిపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ప్రపంచానికి మనల్ని పరిచయం చేసిన తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని వారిని విస్మరించరాదన్నారు. గ్రామసేవే రామ్‌సేవ అని సమాజసేవ కార్యక్రమంలో పాల్గొంటూ దేశ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎం యూఎస్ ఇండియా సీనియర్ డైరెక్టర్ రమేష్ కున్నట్, సలహాదారులు యూఎస్ కాన్సులేట్ అనిత లహరి, సత్యసాయి సేవా సంస్థ తెలంగాణ శాఖ అధ్యక్షుడు వెంకట్‌రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మల్లేశ్వరరావు 60 కళాశాలలకు చెందిన 6వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డీసీ వంశీకృష్ణ, ఎస్‌డబ్ల్యూఎం డీసీ వేణుగోపాల్‌రెడ్డి

హఫీజ్‌పేట్: పారిశుధ్య కార్మికుల హాజరులో నిర్లక్ష్యం వహిస్తే తక్షణమే ఉద్యోగం నుంచి తొలగిస్తామని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ఎస్ఎఫ్ఏ, ఎస్ఆర్‌పీలతో ఎస్‌డబ్ల్యూఎం డీసీ వేణుగోపాల్ రెడ్డి, డీసీ వంశీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికలో ఎలాంటి అవకతవకలు జరిగినా సంబంధిత ఎస్ఎఫ్ఏ, ఎస్ఆర్‌పిలదే బాధ్యత అని వెంటనే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. రోడ్లపై, ఖాళీ స్థలాలలో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు కనబడితే చర్యలు తప్పవన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఖాళీ ప్రదేశాలలో చెత్త వేయకుండా బస్తీ, కాలనీలలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ కార్తీక్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, 21 ఎస్ఎఫ్ఏలు, 6 ఎస్ఆర్‌పీలు పాల్గొన్నారు.

నాలా కల్వర్టు పనుల పరిశీలన



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంజుల

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని కైలాష్‌నగర్ వద్ద జరుగుతున్న నాలా కల్వర్టు పనులను స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు రూ.1.60 లక్షలతో కల్వర్టు పనులు చేపడుతున్నామన్నారు. అమీన్‌పూర్‌కు వెళ్లాలంటే ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కల్వర్టు పూర్తయితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ సంతోష్, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'మాకూ నియామక పత్రాలు ఇవ్వాలి'

పంజగుట్ట: గురుకుల నియామకాల్లో సెలెక్ట్ అయిన బీటెక్, బీఈడీ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వాలని అభ్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభ్యర్థులు రాఘవేంద్ర, నవనీత, అపర్ణ, శివాని, వినిత మాట్లాడుతూ... 2014 నుంచి ప్రభుత్వమే బీటెక్ చదివిన వారికి బీఈడీ చేసే అవకాశం కల్పించిందన్నారు. తాము బీటెక్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులమని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల ఉపాధ్యాయుల 9200 పోస్టులకు తాము కూడా దరఖాస్తు చేసుకున్నామని, గురుకుల బోర్డు వారు నిర్వహించిన పరీక్షలు రాశామని తాము అదరం టాప్ 100లో వచ్చామని, ఉద్యోగాల్లో సెలెక్ట్ కూడా అయ్యామని తెలిపారు. అయితే సోమవారం ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా ఇచ్చే అపాయింట్‌మెంట్ ఆర్డర్లలో తమ 97 మంది పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవచూపి తమకు కూడా అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ కొలువులో సైన్స్ కళాశాల విద్యార్థులు

బంజారాహిల్స్: సైఫాబాద్ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో విద్యాభ్యాసం చేసి 40 మంది విద్యార్థులు ప్రభుత్వ కొలువులను సాధించారు. వీరు పలు విభాగాల్లో సెలక్ట్ కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ సంతోషం వ్యక్తం చేశారు. 40 మంది 21 మంది జూనియర్ లెక్చరర్ (జేఎల్), టీజీటీ, పీజీటీల్లో, అలాగే మరో 19 మంది విద్యార్థులు కానిస్టేబుళ్ల ఉద్యోగాలను పొందారు. సోమవారం లక్ష్మణ్‌నాయక్ తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వినోద్‌కుమార్ అనే విద్యార్థి ఒక్కటేసారి మూడు జాబ్‌లను సాధించడం పట్ల సన్మానించారు.

ప్రభుత్వ భూముల్లోని అక్రమ నిర్మాణాలను తొలగించాలి

'ప్రజావాణి'లో జెడ్‌సీకి బీజేపీ నాయకుల వినతి



జెడ్‌సీ అభిలాషకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు కమలాకర్‌రెడ్డి, కుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: సర్వే నెంబర్ 57, 336లోగల ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, బీజేవైఎం నేషనల్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. వెంటనే ఆ నిర్మాణాలు తొలగించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో దవాఖానా, క్రీడా మైదానం, మహిళా భవన్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిపై త్వరగా రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ప్రభుత్వ భూములను కాపాడుతామని జెడ్‌సీ హామీ ఇచ్చారన్నారు.

◆ అదే విధంగా మహంకాళినగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్డు, మంచినీటి సమస్యలు, చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించటం, దోమల సమస్య, హిందూ శ్మశానవాటిక వంటి అనేక సమస్యలను కూడా జెడ్‌సీ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, సీనియర్ నాయకులు కేశవరావు, అరుణ్‌కుమార్, మణిభూషణ్, డివిజన్ నాయకులు రఘు, సంతోష్, ప్రకాష్, శ్రీనివాస్‌రెడ్డి, మహిళా నాయకురాలు అనూష, జ్యోతి, మహంకాళినగర్, జయనగర్ వాసులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 68 మంది వినతులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పలువురు తమ సమస్యలను తెలిపి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రాలు అందజేశారు. మూసాపేట 5, కూకట్‌పల్లి 9, కుత్బుల్లాపూర్ 9, గాజులరామారం 11, అల్వాల్ 2, కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం పరిధిలో 22 మొత్తం 68 మంది వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ.. సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు.



ప్రజావాణిలో జోనల్ కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న ప్రజలు

సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్

'మనూ' వీసీ ప్రొ. ఐనుల్‌హసన్

రాయదుర్గం: సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో మొదటి అంతర్జాతీయ ఉర్దూ సైన్స్ కాన్ఫరెన్స్–2024 సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అనే అంశంపై ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ మానవ శరీరం ప్రతికూల పరిచయ వ్యవస్థగా అభివృద్ధి చెందుతోందన్నారు. హైదరాబాద్‌లోని బిట్స్‌పిలానీ సీనియర్ ప్రొఫెసర్ అహ్మద్ కమల్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో ఔషధాల తయారీ గురించి వివరించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్‌ఖాన్, డాక్టర్‌సలావుద్దీన్ సయ్యద్, డాక్టర్ మాజిద్ అలీ చౌదరి ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సులో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు 150 సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు.



సదస్సులో పాల్గొన్న వీసీ ఐనుల్‌హసన్, హెచ్‌సీయూ వీసీ ప్రొ. బీజే రావు, ప్రొఫెసర్లు